# సద్గురు బోధలో జగద్గురు గీత
# 6వ అధ్యాయం

సర్వం శ్రీసాయి సేవా ట్రస్ట్
Regd. 192/2019



సద్గురు బోధలో జగద్గురు గీత

6వ అధ్యాయం

6వ అధ్యాయ ప్రారంభం లో గురు కర స్పర్శ మహిమను చెప్తూ "ప్రళయాగ్నిచే కూడా కాలనట్టి వాసనామయమైన సూక్ష్మ శరీరము కూడా గురుకర స్పర్శ చే భస్మమై పోతుంది. అనేక జన్మార్జిత పాప సంచయం కూడా పటాపంచెలు అవుతాయి. ఆధ్యాత్మిక సంబంధ విషయాలు వినడం వల్ల వారి వాక్కు నెమ్మదిస్తుంది" అని చెప్పబడింది. ఇదే కాక ఇంకా ఎన్నో అనుభవాలు ఇందులో పేర్కొన బడ్డాయి. అవి చూద్దాము.

ముందుగా అసలు ఈ సూక్ష్మ శరీరం అంటే ఏమిటో చూద్దాం. ఈ ప్రపంచమంతా పంచభూతాత్మకం. మన శరీరం కూడా పృథివ్యాపస్తేజో వాయురాకాశాత్'..అంటే భూమి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశం అనే పంచభూతాలతో నిర్మితమైనదే. పైకి కనిపించేదంతా స్థూల శరీరం. స్థూల శరీరంలో సూక్ష్మ శరీరం, కారణ శరీరాలున్నాయి. ఎముకలు, మూలగ, రక్తనాళాలు, మాంసం, రక్తం, చర్మం అనే అనే ఆరు పదార్థాలతో ఏర్పడింది స్థూల శరీరం. తల, కాళ్లు, చేతులు, వెన్ను, మస్తకం అనే అవయవాలతో మలమూత్ర సహితమై, 'నేను', 'నాది' అనే అహంకారంతో కూడుకున్నదే స్థూలశరీరం.

ఇక మనసు, బుద్ధి, జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు, సూక్ష్మ పంచభూతాలు కలిసి మొత్తం పదిహేడు తత్వాలతో ఏర్పడింది సూక్ష్మ శరీరం. జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలంటే స్థూల శరీరంలో బయటకు కనిపించే కళ్లు, చెవులు, కాళ్లు, చేతులు కాదు. అవి ఆ ఇంద్రియాలకు చెందిన బాహ్యోపకరణాలు. ఈ ఉపకరణాల ద్వారా విషయాలు ఇంద్రియాలకు చేరతాయి. ఉదాహరణకు బయటకు కనిపించే కన్నులో నేత్రేంద్రియం లేదు. నేత్రేంద్రియం మెదడులోని నాడీ కేంద్రంలో ఉంటుంది. ఇతర ఇంద్రియాల విషయం కూడా ఇంతే.

ఇంద్రియాలన్నీ శరీరంలోని నాడీ మండలంలో ఉంటాయి. కన్ను ద్వారా దృశ్యం నేత్రేంద్రియానికి చేరుతుంది. సూక్ష్మ పంచ భూతాలంటే శబ్ద స్పర్శ రూప రస గంధాదులు. వీటినే విషయాలు లేదా పంచ తన్మాత్రలు అంటారు. ఇంద్రియాల ద్వారా విషయాలు మనసుకు చేరుతాయి. మనసు బుద్ధికి అందజేస్తుంది. బుద్ధి నుండి జీవుడు గ్రహిస్తాడు. అప్పుడు చేయవలసిన పనికి కర్మేంద్రియాలను నియమిస్తాడు.

స్థూల శరీరాన్ని తేజోమయం చేస్తున్నది సూక్ష్మ శరీరమే. సూక్ష్మ శరీరానికి ఆధారం ఆత్మ. కాబట్టి సూక్ష్మ శరీరం లేకుండా స్థూల శరీరం ఎందుకూ పనికిరాదు. స్థూల శరీరం సూక్ష్మ శరీరంతో కలిసి విధులు నిర్వర్తిస్తున్నది. ఈ శరీరమే ఆత్మజ్ఞానం పొందడానికి అనువైనది.

జీవుడు శరీరాన్ని వదిలి పెట్టేటప్పుడు సూక్ష్మ శరీరంతో కూడి బయటకు వెళ్తాడు. అప్పుడు స్థూల శరీరం నిర్జీవమవుతుంది. శరీరాన్ని వదిలే ముందు వాక్కు మనస్సులో లీనమౌతుంది. చక్షురాది ఇంద్రియాలన్నీ మనస్సును చేరుతాయి. ఇంద్రియాలతో కూడిన మనస్సు ప్రాణంలో లీనమవుతుంది. ప్రాణం ఆత్మలో లీనమౌతుంది. ఈ విధంగా సూక్ష్మ శరీరం దేహాన్ని విడిచి ఆత్మను చేరి ఉంటుంది.

మృత్యుకాలంలో జీవుడు సూక్ష్మ శరీరంతో పాటు చేసిన కర్మలతో కూడి దేహాన్ని వదలిపోతాడు. సూక్ష్మ శరీరం జీవునికి వాహకమవుతుంది. తదుపరి అది మరో స్థూల శరీరానికి కారణమవుతుంది కాబట్టి దానిని కారణ శరీరమంటారు. సూక్ష్మంగా చెప్పాలంటే మన గత జన్మల పాప, పుణ్యాల ఫలితాలు, మునుపటి జీవితాల సంస్కారాలతో కూడి ఉన్న శరీరమే సూక్ష్మ శరీరం.

అంటే ఈ సూక్ష్మ శరీరం తన గత జన్మల యొక్క కోరికలు, సాధనాలు, అలవాట్లు, భావ పరంపర నిబిడీకృతం అయి ఉంటుంది అన్నది తెలుస్తూనే ఉంటుంది. అదే భావలహరి ఆ సూక్ష్మ శరీరం దీనిని ఉపాధిగా తీసుకుని మళ్ళీ జన్మ పొందుతుందో ఆ జీవికి ఆలవాలం అవుతాయి. అటువంటి జన్మ జన్మల సంస్కారాలు ఆమోద యోగ్యం అయితే, కుసంస్కారాలు హర్షింప తగ్గవి కాదు. అటువంటి కుసంస్కారాలు కూడా సర్వజ్ఞత పొందిన మహా పురుషులు, లేదా గురువర్యుల చేతి స్పర్శతోనే దహింప బడి, మరుజన్మ కు కారణాలు కావు అని తెలుస్తోంది.

అలాగే ఇంతకు ముందు మనం సంచితం, ఆగామి, ప్రారబ్ధం గురించి చాలా విశదం గా తెలుసుకున్నాం. అందువల్ల ఇందులో ప్రస్తావించిన సంచితం గురించే సూక్ష్మంగా చూద్దాము. ఇంతకు ముందు జన్మలో చేసి, తర్వాతెప్పుడో ఫలితం ఇవ్వడానికి కూడబెట్టబడిన కర్మలలో నుండి ఆ జన్మలో ఎప్పుడో ఒకప్పుడు ఫలితాన్నిచ్చి శాంతించినవి పోను, మిగిలినకూడబెట్టబడిన కర్మలను, అదేవిదంగా అంతకుముందు జన్మలలో చేసిన కర్మఫలం నుండి ఖర్చు అయినవిపోగా ఒక జన్మనుండి మరొక జన్మకు మోసుకుంటే వచ్చిన కర్మలను సంచిత కర్మలు అంటారు.

జీవుడు శరీరాన్ని వదిలిపెట్టినా, ఈ సంచిత కర్మలు మాత్రం జీవున్ని విడిచి పెట్టకుండా అతడితో ప్రయాణమై వస్తుంటాయి. మనం అద్దె ఇళ్ళలో వుండి, మరొక ఇంటికి మారేటప్పుడు ఆ ఇంటిలో ఉన్న వస్తువులను ఎలా మూటగట్టుకొని తీసుక వెళతామో అలాగే జీవుడు భగవంతుడు ఇచ్చిన అద్దె ఇంటిలాంటి ఈ శరీరాన్ని విడిచి వెళ్ళేటప్పుడు ఆ శరీరంలో ఉన్నప్పుడు సంపాదించిన, కర్మఫలాలను మూటగట్టుకొని తగిన మరొక అద్దెకొంపలాంటి శరీరాన్ని వెతుక్కుంటూ వెళతాడు. ఇలా తీసుకువెళ్ళేవే 'సంచిత కర్మలు'. ఇలా మరు జ జన్మకు కారణం అయ్యే సంచితము ను కూడా గురుకర స్పర్శ దహింపచేసి మళ్ళీ జన్మ లేకుండా చేస్తుంది అని చెప్పబడింది. (జక్కని వేంకటరాజం గారి వ్యాసం నించి కొంత విషయం తీసుకోవడం జరిగింది).

హేమడ్ పంతు సాయి దర్శనము కాగానే "కంఠం గద్గదం అవుతుందని, ఆనందాశ్రువులు పొంగి పొరాలుతాయని, హృదయం భావోద్రేకంతో నిండుతుందని తెలియచేశారు. హేమాద్ పంతు కి అలా తోచింది అంటే అది బాబా వారి సంకల్పమే కదా. మరి వాటి వివరం చూద్దాము.

తతః స విస్మయావిష్టో
హృష్టరోమా ధనంజయః ।
ప్రణమ్య శిరసా దేవం కృతాంజలిరభాషత ।।
గీత 11-14

అప్పుడు, పరామాశ్చర్యమునకు లోనయ్యి, రోమములు నిక్కబోడుచుకున్నవాడైన అర్జునుడు, చేతులు జోడించి తలవంచి నమస్కరిస్తూ, భగవంతుడుని స్తుతించాడు.

శ్రీకృష్ణ భగవాన్నుడి విశ్వరూప దర్శనం చేసుకున్న తరువాత అర్జునుడి స్థితి పై మాటల్లో వ్యక్తమవడం చూస్తాము. అదే స్థితి మన హేమడ్ పంతు మాటల్లో మనం గ్రహిచ వచ్చు. అది భక్తి వల్ల కలిగిన భావం.

నిజమైన భక్తి ఎనిమిది విధాలుగా సాత్వికంగా వ్యక్తం అవుతుందిట. ఆ లక్షణాలే "స్తంభించి పోవటము, చెమటలు పట్టటము, గగుర్పాటు, గొంతు బొంగురు పోవటము, వణుకు, పేలగా మారటము, కన్నీరు కారటము, మూర్చ పోవటము. హేమడ్ పంతు పొందిన అనుభూతి ఇదే.

ఒక విధంగా బాబా వారు తమ ఆచరణలో హృదయాంతరాలంలో దేదీప్యమానంగా వెలుగొందుతున్న ఆ దేవదేవునిని మీద మనస్సు ఉంచి

సాధన (అంటే ధ్యానం) ద్వార మీ హృదయాంతరంలోనే దర్శించుకోండి అనే సూచించారు.

అయితే ఆ స్థితి మనస్సు నిశ్చల స్థితిలోకి వెళ్ళినప్పుడు మాత్రమే జీవాత్మ/పరమాత్మల భేదాలు తొలగిపోయి సాధ్యం అవుతుంది. అటువంటి నిశ్చల స్థితిలో పరమాత్మ తప్ప వేరుగా ఏదీ లేదు అనే అద్వైత స్థితిని అనుభవించ గలుగుతాము. ఆ స్థితిని చేరుకోవాలంటే, భగవంతుడిని తదేక దీక్షగా ధ్యానం చేయాలి అని మనకి 'అల్లాహ్ మాలిక్' అంటూ సూచించారు.

ఇంకా హేమాడ్పా పంతు బాబా ద(రి)శనం తో మనస్సు.. వాక్కు నెమ్మదిస్తాయన్నాడు. అది బాబావారి ఆచరణ లో మనం గ్రహించవచ్చు. భగవత్ చింతన అలవాటైన కొద్దీ, మన మనసు నెమ్మది నెమ్మదిగా ఈ కష్టముల వల్ల కలిగే బాధ నుండీ, మరియు సుఖముల వల్ల కలిగే ఆనందము నుంచీ, రెండిటి నుండీ విడివడడం మొదలవుతుంది. భగవంతుని యందు మనసు పెట్టి, సాధన పెరుగుతున్న కొద్దీ, పోను పోను అన్నీ ఈశ్వరేచ్ఛగా జరుగు తున్నాయి, అన్నీ ఈశ్వరుడే చూసుకుంటాడు అని, తనకి కష్టం వచ్చినా, సుఖమే వచ్చినా రెండిటినీ పట్టించుకోని స్థితిలోకి వెలటాము. ఒకవిధమైన ఆనందము, శాంతి కలగడం ప్రారంభం అవుతుంది.

చివరికి ఒక కష్టానికి కృంగి పోని, సుఖానికి పొంగిపోని స్థితి కలిగి, అన్నిటినీ ఈశ్వరుడే ఇస్తున్నాడు, అన్నీ ఆయనే చూసుకుంటాడు అనే శరణాగతి బుద్ధి అలవడుతుంది. ఇదే, మనల్ని ఆత్మోన్నతివైపుకి నడిపిస్తుంది. ఈ విధంగా ఆలోచించడం వల్ల, మనకి పూర్ణత్వము ప్రాప్తిస్తుంది.

అయితే ఈ స్థితి సాధించడానికి ఉన్న ఆటంకమే మన మనస్సు. దాని ద్వారానే నిన్న మనం తెలుసుకున్న సంచితము, మరు జన్మ అడ్డంకులు అవుతాయి. అది ఎందుకు అంటే మన మనస్సును నిశ్చలముగా, ఎటువంటి ఆలోచలు లేకుండా నిలపలేక పోవడము వల్ల. అందుకు కారణం మనం పూర్వ జన్మలో చేసిన కర్మల ఫలితము.

ప్రతీ జన్మలోనూ మనం ఏవో కొన్ని పాపములు చేస్తూ వస్తాము. జన్మజన్మాంతర ఆ పాపరాశి ధ్వంసం అయితే తప్ప, మనం ఆత్మ దర్శనం పొందలేము. అటువంటి స్థితిని చేరుకోవాలంటే, మన

కర్మలన్నిటికీ ఫలితాలనిచ్చే ఈశ్వరుడు, మన పాపములన్నిటికీ మన చేత శిక్ష అనుభవింప చేసిన తర్వాత మాత్రమే సాధ్యము.

పాపాలు చేయడం ద్వారా. పుణ్య కార్యములు చేయడం ద్వారా వచ్చిన ఫలాలు భోగించ దానికి ఈశ్వరుడు ఇంకో శరీరాన్ని ఇస్తాడు. అప్పుడు ఆ కొత్త శరీరంతో ఇతఃపూర్వం ఉన్న పాప/పుణ్య రాశి కొంత అనుభవించగలుగుతాము.

అయితే మనం గత జన్మలలో ఉన్న పాపములను అనుభవించడమే కాకుండా, ఈ జన్మలో మళ్ళీ కొత్తగా పాపములను చేస్తూ, మన పాపముల చిట్టా రోజు రోజుకీ పెంచుకుంటున్నాము.

ఇలా మనం అజ్ఞానంతో పాపములను తగ్గించుకోవడం మానేసి, గుణాత్మకంగా పాపములను పెంచుకుంటున్నాం. అది పోవాలి అంటే మనం గురువుని ఆశ్రయించి, వారి నుడివిన మార్గంలో శ్రద్ధ-సబూరి తో సాగాలి. అప్పుడు గురుకృప సాధించి, మనం ఆత్మోన్నతి వైపు సాగుతాము.

గురువు కర స్పర్శ తగలగానే "నేనే తాను (పరబ్రహ్మ స్వరూపమును) అన్న స్ఫురణ మేల్కొని, ఆత్మసాక్షాత్కార ఆనందం కలిగించును. నేను-నీవు అన్న భేదభావం తొలగించి బ్రహ్మైక్యానుభవమును సిద్ధింపచేయును" అంటారు మన హేమాడ్ పంతు.

తత్ - అంటే ఎక్కడో ఉన్నాడు (అనుకుంటున్న బ్రహ్మతత్త్వం లేదా భగవంతుడు) త్వం - నువ్వే .. అసి (అయి ఉన్నావు) . అంటే నువ్వు కూడా బ్రహ్మమే అని దీని అర్థం. సామవేదంలోని చాందోగ్యోపనిషత్తు నుంచి వచ్చిన వాక్యం ఇది. ఇదే కాదు మిగిలిన మూడు మహావాక్యాల సారం కూడా భగవంతుడు మరెక్కడో లేడు-మన అందరిలోనూ, అన్ని జీవుల్లోనూ ఉన్నాడనే భావన వస్తుంది. ఇది ముఖ్యంగా చెప్పేది భగవంతుడిని బయట కాదు నీలోనే అంతర్యామి గా ఉన్న ఆయనను చూడు అని.

ఇక్కడ గ్రహించాల్సింది ఏమిటి అంటే ఇవన్నీ ఎన్నో ఉపనిషత్తు లో చెప్పిన సారము. అటువంటి సారాన్ని తన నడవడిక లో మనకి చూపించి, మనం తెలియకుండానే ఆ పరబ్రహ్మ స్వరూపాన్ని దర్శనం

చేసుకొనేల చేశారు అన్నది హేమాడ్ పంతు మాటల్లో వ్యక్తం చేశారు. ఆ భావం ఆత్మ సాక్షాత్కారానికి దారి తీస్తుంది అన్నారు.

ఆత్మసాక్షాత్కారం అంటే మరేదో కాదండి. మనల్ని నడిపించే శక్తి ఏదో తెలుసుకోవడమే.

ఈశ్వరః సర్వభూతానాం హృద్దేశేఽర్జున తిష్ఠతి ।
భ్రామయన్ సర్వభూతాని యంత్రారూఢాని మాయయా ।।
గీత 18-61

ఈశ్వరుడు సమస్త ప్రాణుల హృదయములో స్థితుడై ఉంటాడు, ఓ అర్జునా. భౌతిక శక్తిచే తయారు చేయబడిన యంత్రమును అధిరోహించి ఉన్న జీవాత్మల గతిని, వాటి వాటి కర్మల అనుగుణముగా, ఆయన నిర్దేశిస్తూ ఉంటాడు.

జీవుడు ఎప్పుడూ భగవంతుడి ఆధీనంలోనే ఉంటాడు. అష్ట విధ ప్రకృతే ఆయన అయినప్పుడు, అందులోని పంచభూతాలతో తయారయిన ఈ శరీరం ఆయన ఇచ్చినదే. ఈ శరీరాన్ని మనం సూక్ష్మ శరీరం తెచ్చుకున్న వాసనలకు అనుగుణంగా ఆయన ఇచ్చాడు.

ఇక ఆయన మన లోపల, బయటా అంటా నిండి ఉన్నాడు అన్నది వేదాలు ఎలుగెత్తి చాటుతున్నాయి. నారాయణ సూక్తం అదే చెప్తూ 'అంతర్బహిశ్చ తత్సర్వం వ్యాప్య నారాయాణ స్థిత:' అంటోంది.

మన పూర్వ కర్మల ప్రకారం, మనకి సరిపోయే దేహం ఇవ్వడమే కాకుండా దానిలోనే కూర్చుని, మన శరీరం లోని ప్రతి చర్య.. దాని గతి తప్పకుండా జరిగేలా చూస్తూ, మన యొక్క సమస్త ఆలోచనలను, మనో వాక్కాయ కర్మలను సాక్షీభావంతో చూస్తూ, మన కర్మలకు తగ్గ మంచి చెడు ఫలాలు మనకు దరిచేరాలా చూస్తున్నాడు. అటువంటి స్వామికి శరణాగతి చెయ్యడం తప్ప మనం ఏమి ఇచ్చుకోగలం.

ఈ పరమ సత్యం తెలుసుకోవడమే ఆత్మసాక్షాత్కారం. ఇది మన బాబా వారు చాల సులువుగా మనకి అర్థం అయేలా శ్రద్ధ-సబూరి, అహంకారం వీడడం, కర్మలను ధునిలో వేయడం, అన్ని కర్మలూ అల్లాహ్ మాలిక్ అన్న సూత్రాన్ని గుర్తుంచుకుని నిర్వర్తిస్తూ ఉండమని మనకి సరళంగా అర్థం అయ్యే రీతిలో బోధించారు.

ఎప్పుడైతే ఆ సత్యం అవగతం అవుతుందో, అప్పుడు నేను-నీవు, వారు-వీరు, ఆత్మ-పరమాత్మ అన్న ద్వందాలు తొలిగి "ఈశ్వర సర్వభూతానాం" అన్నది అనుభవపూర్వకంగా తెలుస్తుంది. అప్పుడు పొందేదే బ్రహ్మైక్యానుభవం. శరీరంలో ని పంచేంద్రియాలు,కర్మేంద్రియాలు , మనసు బుద్ధి ఇవన్నీ కలిసి , అంతరాళం లో నిక్షేపించు కున్న పరమాత్మ సుందర సురుచిర, సౌందర్య లావణ్యాన్ని దర్శిస్తూ, ఆత్మలో రమిస్తూ పొందే భావం.

ఈ అధ్యాయంలో హేమాడ్ పంతు "భక్తునిలో అహంకారము విజృంభించగానే బాబా దానిని అణచివేయును. సాయి పాదాలకు శరణాగతి చేసి చేసిన వారికి ధర్మార్ధ కామ మోక్షములు కరతలామలకములగును" అని అంటారు.

ఈ అహంకారం విషయంలో మహా భారతం శాంతిపర్వం ఏమి చెప్తోందో చూద్దాం. షష్టమాశ్వాసం లో యాజ్ఞవల్క్యుడు విశ్వావసుడు తో జీవాత్మ-పరమాత్మ ల విషయం చెప్తూ "పురుషుడు ప్రకృతితో చేరి అనేక రూపములు పొందుతూ జనన మరణ చక్రంలో ఇరుక్కు పోతూ ఉంటాడు. పురుషుడిని జీవుడు అంటారు. ప్రకృతి పురుషుడిని చూడలేక పోయినా పురుషుడు (అంటే జీవుడు) ప్రకృతిని చూస్తూ అందులో లీనమై ఇక పరమాత్మ వైపు చూడ లేడు. కాని పరమాత్మ (భగవంతుడు) ఈ పురుషుడిని ప్రకృతిని సాక్షీ భూతంగా చూస్తూ ఉంటాడు.

పురుషుడు పరమాత్మను దర్శించే ఉపాయము చెప్తాను. పురుషుడు ప్రకృతితో స్నేహం చేస్తూ ప్రకృతే తాను అనుకుని క్రమంగా ప్రకృతిలో లీనమౌతాడు. అందువలన అహంకారం పెరుగుతుంది. ప్రకృతిలోని వస్తువుల మీద మమకారం పెరిగి వాటిని పొందాలన్న కోరిక పెరుగుతుంది. పురుషుడు ప్రకృతిని చూస్తున్నంత కాలం పరమాత్మను దర్శించ లేక జీవుడిగా మిగిలి పోతాడు.

ఎప్పుడైతే పురుషుడు తానే ప్రకృతి ప్రకృతే తాను అన్న భావన విడిచి నీటిలో ఉన్న తామరలా తాను వేరు నీరు వేరు అనుకుంటాడో అప్పుడు ప్రకృతిలో సంచరిస్తున్న పురుషుడు తాను వేరు ప్రకృతి వేరు అని తెలుసుకుని పరమాత్మను దర్శిస్తాడు. పురుషుడికి జననము, వృద్ధాప్యము, మరణము తప్పవని తెలుకుని యోగి సాంఖ్యమును, యోగమును ఆశ్రయించి మమకారాన్ని వదిలి పునర్జన్మ లేని

పరతత్వాన్ని పొందుతాడు. ప్రకృతి వేరు తాను వేరని పురుషుడు భేదం గ్రహించినప్పుడే పరమాత్మను చేరగలడు.

పురుషుడు వేరు పుషోత్తముడు వేరని సామాన్యులు అనుకుంటారు కాని విజ్ఞులకు అభ్యాసం వలన ఇద్దరూ ఒకరే అని గ్రహిస్తారు. అజ్ఞాని మాత్రం పురుషుడు వేరు పురుషోత్తముడు వేరని అనుకుంటారు. మమకారమును పోగొట్టుకున్నప్పుడు పురుషోత్తముడిని గురించి తెలుసుకోగలుగుతారు " అని చెప్పాడు.

ఇందులో మనం తరచి చూస్తే అన్ని విక్రృతులకు కారణం అహంకారం. ఈ అహంకారాన్ని వదిలితే గాని ఆత్మ-పరమాత్మ ని చేరలేదు. ఇంతటి జ్ఞాన బోదని ఏదో ప్రవచనలా కాక ఎప్పుడు తనను నమ్మిన వారికి చేరువగా ఉంటూ, వారి దైనందిన జీవితాన్ని ప్రభావితం చేస్తూ, ఎలా అహంకారాన్ని వదిలి, ప్రతి ఒక్క కర్మని నేను చేస్తున్నాను అన్న అహంభావం తో కాక, అంతా భగవదర్పితం అన్న భావంతో కర్మ ఫలాలను భగవదర్పితం చేస్తూ (ధునిలో అర్పిస్తూ) ఎప్పుడూ భగవన్నామ స్మరణ (అల్లాహ్ మాలిక్) లో జీవన యానం సాగించమని బాబా తన ప్రవర్తన లో చూపడమే కాకా, అవసరం అయితే తనను నమ్మిన వారిని ఆవిధంగా.నియంత్రించారని ఇక్కడ హేమాడ్ పంతు చెప్తున్నారు.

ఇక శరణాగతి విషయానికి వస్తే 'నన్ను భజించేవారి, శరణు జొచ్చిన వారి రక్షణ భారం నేనే వహిస్తా' నని గీతాచార్యుడు అభయమిచ్చింది అందరికీ తెలుసు. భగవంతుని సుహృద్భావం. కృపాపరత్వం అపారం. తనను నమ్మి ప్రేమించేవారిని, సేవించే వారిని రక్షిస్తాడు. స్నేహితునిగా మనుష్యుని ప్రతిక్షణం కాపాడుతూ ఉంటాడు. కానీ, అందుకు మనం చేయాల్సింది ఒకటుంది. అదే ఆయన తత్వాన్ని తెలుసుకొని శరణాగతి వేడడం.. మొసలి నోటికి చిక్కి ప్రాణాలు ఠావులు తప్పిన గజేంద్రుడిలా.. 'నీవే తప్ప నితఃపరంబెరుగ.. రావే ఈశ్వర, కావవే వరద, సంరక్షింపు భద్రాత్మకా' అంటూ ఆ పరమాత్మపైభారం వేయాలి. ఇలా మన పురాణాలలో అనేక మంది భక్తులు భగవంతుని శరణాగతితో కృతార్థులై తరించి, లోకానికి శరణాగతి విలువను తెలియచేశారు. భగవంతుని శ్రీచరణాలను వదిలి వేరొక దానిలో సుఖశాంతులున్నాయనుకుంటే అది అహంకారం.

భగవంతుడిని శరణాగతి వేడాలంటే.. సచ్చరితులే అయి ఉండాల్సిన అవసరం లేదు. ఎంతటి పాపాత్ములు శరణాగతి కోరినా సరే.. పరమాత్మ

వారి కష్టాన్ని చూస్తాడు తప్ప దోషాలను చూడడు. ఇది బాబా వారి చరిత్రలో మనం చూస్తాము. అందులో తరించిన భక్తులు కుల పరంగానో, మత పరంగానో, లేదా ఐశ్వర్యం లో ఉన్నతులో మాత్రమె కాక, చాల సాధారణ జీవులే ఉద్ధరించబడ్డ ఉదంతాలు తారస పడతాయి. ఇక వాఙ్మయాలు చూస్తె రామాయణంలో హనుమంతుడు, సుగ్రీవుడు, విభీషణుడు, గుహుడు మున్నగువారు భారతంలో పాండవులు, భీష్మపితామహుడు, భాగవతంలో గజేంద్రుడు, రంతి దేవుడు, కుచేలుడు మొదలైనన వారు భగవద్విశ్వాసులై, భక్తి శ్రద్ధలతో తాము కొలిచిన దైవాన్ని శరణాగతి వేడి ధన్యులయ్యారు.

అటువంటి బాబా వారి కృప మనపై కురవాలంతే మనకు ఉండాల్సింది కేవలమ శ్రద్ధ-సబూరి, అహంకార త్యాగం, అనన్య శరణాగతి.

"భగవత్ సాన్నిధ్యమునకు పోవుటకు కర్మ, జ్ఞాన, యోగ, భక్తి మార్గములు అనేది నాలుగు త్రోవలు కలవు. అన్నిటిలో భక్తి మార్గము కష్టమైనది. సద్గురుని సాయంతో దారిలోని ముళ్ళను, గోతులను తప్పించుకుని గమ్య స్థానమును అవలీలగా చేరవచ్చును" అని బాబావారు వక్కాణించారు అని ఆరవ అధ్యాయం లో తెలుస్తోంది.

పై మాటలలో మనకు గురువు ఆవశ్యకత చాల విశదంగా తెలుస్తోంది. ఈ విషయంలో ఇదే గ్రంథం లో వచ్చిన ఒక గీత లోని శ్లోకం చూద్దాము.

తద్విద్ధి ప్రణిపాతేన
పరిప్రశ్నేన సేవయా ।
ఉపదేక్ష్యంతి తే జ్ఞానం జ్ఞానినస్తత్త్వదర్శినః ।।
అ 4 - 34 ।।

ఒక ఆధ్యాత్మిక గురువుని చేరి పరమ సత్యమును నేర్చుకొనుము. వినయంతో ఆయనను ప్రశ్నలు అడుగుతూ మరియు ఆయనకు సేవ చేయుము. అటువంటి మహాత్ముడైన జ్ఞాని నీకు జ్ఞానోపదేశం చేయగలడు ఎందుకంటే అతను స్వయంగా యథార్థమును దర్శించినవాడు.

బాబా గారు సరళంగా చెప్పిన మాటనే పైశ్లోకంలో మనం చూడవచ్చు. ఆధ్యాత్మిక జ్ఞానం ఎలా సముపార్జించుకోవాలి అన్న ప్రశ్నకు సమాధానం ఇస్తూ కృష్ణుడు ఈ శ్లోకం లో ఇలా అన్నాడు.

1) ఆధ్యాత్మిక గురువు దరిచేరండి 2) ఆయనని వినయంతో అడగండి 3) ఆయనకి సేవ చేయండి

అందుకు కారణం ఏమిటంటే ఆత్మ యొక్క బుద్ధి అనంత జన్మల అజ్ఞానంచే కప్పివేయబడి ఉంది. అవిద్యచే ఆవరింపబడి ఉండి, బుద్ధి తన అజ్ఞానాన్ని తన స్వంత ప్రయత్నంచే జయించలేదు. దానికి విరుగుడు ఏమిటంటే ఆత్మతత్త్వాన్ని, సత్యాన్ని ఎరిగిన భగవత్ ప్రాప్తి నొందిన మహాత్ముని ద్వారా ఆ జ్ఞానాన్ని అందుకోవడం.

ఆధ్యాత్మిక పథంలో గురువు యొక్క ప్రాముఖ్యాన్ని, వైదిక గ్రంధాలు పదే పదే మనకు ఉపదేశిస్తున్నాయి. ఇదే మాటని (ఛాందోగ్య ఉపనిషత్తు 6.14.2) ఆచార్యవాన్ పురుషో వేదః - గురువు ద్వారా మాత్రమే నీవు వేదములను అర్థం చేసుకొనగలవు" అని చెప్తోంది.

వేదాంత పంచదశీ కూడా "గురువు గారిని స్వచ్ఛమైన మనస్సుతో, సందేహములు విడిచి సేవించండి. తదుపరి ఆయన మీకు శాస్త్ర జ్ఞానాన్ని మరియు వివేచనాత్మకత ఉపదేశించి, గొప్ప ఆనందాన్ని కలిగిస్తాడు" అని చెప్తోంది.

"గురువు కి శరణాగతి చేయకుండా నీకు భౌతిక మాయ నుండి ముక్తి లభించదు" అని సాక్షాత్తూ ఆది శంకరులు వారు కూడా చెప్పారు.

వేరే విద్యల మాట ఎలా ఉన్నా ఆధ్యాత్మిక ఆత్మజ్ఞానం అనేది శిష్యునికి యాంత్రికమైన బోధనా పద్ధతి ద్వారా ఆపాదించబడదు, దాన్ని ఏదో ఒక మూల్యం చెల్లించి కొనుక్కోలేము. శిష్యుడు ఎప్పుడైతే వినయం, నమ్రత పెంపొందించు కుంటాడో, శిష్యుని సేవా దృక్పథంచే గురువు ఎప్పుడు ప్రసన్నమౌతాడో, అది గురుకృపచే శిష్యుని హృదయంలో ప్రకటించ బడుతుంది. కాబట్టి, నిజమైన సాధకులు గురువు గారిని మర్యాదతో చేరుకొని, పరమ సత్యము గురించి వినయంతో అడిగి, సేవ ద్వారా ఆయనకు ప్రీతి కలిగించడం ఆవశ్యకము.

బాబా గారి మాటలు, శ్రీకృష్ణుడు బోధలు, వేదాల వాదాలు కలిపి చూస్తే మనస్సుని శరీరాన్ని శుద్ధి చేసుకొన్న వారికి పాపాలు క్షీణిస్తాయి. వాసనాక్షయం జరుగుతుంది. పూర్వ జన్మ వాసనలు క్రమేపీ తొలగుతాయి. తదనంతరం శారీరకమైన ఆవేదనల్నీ,

ఇంద్రియలోలత్వాన్ని బుద్ధిపూర్వకంగా నిగ్రహించు కోవటంవల్ల మానవునికి ప్రశాంతత ఏర్పడుతుంది.

అయితే మనం చేసే సాధన త్రికరణ శుద్ధి గా ఉండాలి. దేనికి? ఆనందం కోసం మానవుడు కర్మేంద్రియాలను అరికట్టినా మనస్సు మాత్రం విషయాలన్నిటినీ తలపోస్తూ బహిర్ముఖంగా సంచరిస్తూ గడుపుతుంది.

పాపం చెయ్యకుండా ఉండటమే కాదు, మానసికమైన వ్యభిచారం కూడా లేకుండా చూసుకోవాలి. ఈ ఆధునిక కాలంలో మానవులు అందరిలోను జరుగుతున్న నిత్య కృత్యం ఈ మానసిక వ్యభిచారం. దాన్ని అన్ని విధాల అరికట్టాలి. దాన్ని అరికట్టటానికి మనస్సుకి తోడుగా ఆత్మ అనే భగవంతుని దానికి అందించి, ఆత్మతో మనస్సు అనురక్తమై జీవించే విధానాన్ని అలవడేటట్లు చెయ్యాలి. దానివల్ల అంతఃకరణశుద్ధి ఏర్పడుతుంది.

ఇంతగొప్ప శాస్త్ర - సనాతన - సత్య సుహృద్ విషయాన్ని చాలా సరళంగా బోధిస్తూ బాబా వారు శ్రద్ధ-సబూరి తో కర్మలు ఆచరిస్తూ, ఎప్పుడు భగవంతుణ్ణి తల్చుకుంటూ, కర్మలను ఈశ్వరార్పణ చేస్తూ సాగించామని వారి నడత ద్వారా బోధించారు.

సాయి సచ్చరిత్ర ఆరవ అధ్యాయంలో బాబా వారు “నీకు ఏమి కావాల్సి వచ్చినా భగవంతుడిని వేడుకో. ప్రపంచములోని కీర్తి ప్రతిష్ఠలకై ప్రాకులాడడం మాని , దైవం దర్బారులో మన్ననలు పొందుటకు ప్రయత్నించు. ప్రపంచ గౌరవం అందుకునే ప్రయత్నం మాను. మనస్సులో ఇష్ట దైవం యొక్క ఆకారం నిలుపుకో” అని బోధించారు.

ఈమాటల అంతరార్థం బ్రహ్మ తత్త్వం తో ముడడిపడి ఉంది అని హేమాడ్ పంతు అంటాడు గాని వివరం చెప్పలేదు. అదేమిటో చూద్దాం. ఏది కావాల్సినా భగవంతుడినే ఎందుకు వేడుకోవాలంటే ఈ జగత్తు అంతా బ్రహ్మ పదార్థం తోనే చేయబడింది కాబట్టి. అథర్వణ వేదం లో ముండకోపనిషత్తు “సర్వం ఖల్విదం బ్రహ్మ” అన్న మంత్రాన్ని చాటుతోంది. అంటే ఈ సృష్టిలో ఉన్నదంతా బ్రహ్మమే తప్ప మరేమీ కాదు! ఈ వాక్యంయొక్క సారం అర్థమయితే చాలు, భగవంతుడు మరెక్కడో లేడు-మన అందరిలోనూ, అన్ని జీవుల్లోనూ ఉన్నాడనే భావన వస్తుంది.

ప్రతి మనిషిలోను, వస్తువు లోనూ కూడా భగవంతుడు కొలువై ఉంటాడు. అదే "అహం బ్రహ్మాస్మి" అన్నఅనుష్ఠాన భావన కూడా. అది గ్రహించడం కొద్ది మందికే సాధ్యం.

అలా అంతా భగవంతుడు లేదా బ్రహ్మ పదార్థంతో నిండి ఉంది కాబట్టే ఆ సర్వాంతర్యామిని మనలోనూ, అన్నిటిలోనూ, అందరిలోనూ దర్శించుకున్న మహనీయులు, మునులు, మనకు ఆ పరబ్రహ్మని రాముడు అనో, కృష్ణుడు అనో, బాబా అనో ఏదో ఒక సాకారనామంతో ఆరాధించి తరించమని బోధించారు.

అలాగ ఇష్టదైవం పైన మనస్సుని నిలిపి, నామ స్మరణతో అంతఃకరణ శుద్ధి సాధించి, ఆత్మ-పరమాత్మల కు ఈ అహంకార భావనే తప్ప, మరో భేదం లేదని తెలుసుకుని, పూర్తి శరణాగతి చేసిన నాడు, ఇక అడిగేది, అడగ వలసింది మరేదీ లేని స్థితి కరతలామలకం చేసుకోమని సనాతనం బోధిస్తోంది.

ఇంత పెద్ద ఆధ్యాత్మ పరిభాషని చాల సుగమం చేస్తూ బాబా వారు మనకు శ్రద్ధ- సబూరి ముందు బోదించి, అల్లాః మాలిక్ అన్న మాటతో నామ స్మరణను, ధుని ద్వారా అహంకార త్యాగాన్ని, తన పాదాన్ని ఆశ్రయించమని చెప్తూ సర్వశ్వ శరణాగతిని, తద్వారా ఆ సాయి బ్రహ్మ మనలో.. మనతో అంతర్యామిగా ఉంటూ మనల్ని తరింప చేస్తానని బోధించారు.

నాసతో విద్యతే భావో
నాభావో విద్యతే సతః ।
ఉభయోరపి దృష్టోంఽతః
త్వనయోస్తత్త్వదర్శిభిః ।।
గీత 2 - 16 ।।

క్షణభంగురమైన దానికి స్థిరత్వం లేదు మరియు శాశ్వతమైన దానికి అంతం లేదు. ఈ రెండింటి స్వభావాన్ని అధ్యయనం చేసిన తత్త్వజ్ఞానులు ఈ విషయాన్ని యథార్థముగా గమనించి ఉన్నారు.

'తైత్తిరీయ ఉపనిషత్తు' ప్రకారం కూడా ఈ జగత్తు అంతటా ఈశ్వరుడు వ్యాపించి ఉన్నాడు. ఆయన ఈ జగత్తు ని సృష్టించడమే కాక, ప్రతి పరమాణువు లో వ్యాపించి ఉన్నాడు. అయితే అలా సృష్టించ బడ్డ జగత్తుకి ఉనికి ఉంది కాని అది శాశ్వతం కాదు. అనిత్యము.

సాయి బ్రహ్మ, పరబ్రహ్మ, భగవంతుడు, పరమేశ్వరుడు ఇత్యాదులు సృష్టి రచన చేయడంలో సర్వస్వతంత్రులు, ఆనంద స్వరూపులు. ఏకమే తాముగా భాసిస్తున్న ఈ పరబ్రహ్మ అవతారులు జీవులకు సుఖదు:ఖాలు కలిగించేవారు మాత్రమే. కానీ, తాము వాటిని అనుభవించరు. కర్మలు చేయడంలో జీవులు స్వతంత్రులు, కర్మఫలాలను అనుభవించడంలో మాత్రం అస్వతంత్రులు.

పరమేశ్వరుడు 'తాను అనుభవించేది లేదు కనుక, సృష్టి రచన తన కోసం చేసుకోడు' . కర్మలు చేస్తూ, సుఖదు: ఖాలను అనుభవించే అర్హత కలిగినవి జీవులే కనుక వాటికోసమే సృష్టి రచన చేస్తున్నాడు.

అలా అన్ని విధాలుగా మన జీవన గతిని తన నిర్దేశం లో నడిపిస్తున్న స్వామిపై నమ్మకం ఉంచి, మనం లౌకిక విషయాలకు ప్రాకులాడకుండా, కేవలం ఆయన శుభ దృష్టికి ప్రాకులాడితే చాలు. అందులోనే మన జీవోన్నతి ఉందని గ్రహిస్తే చాలు.

అయితే వీట్లన్నిటికి ముఖ్యం గా కావలసింది అహంకార త్యాగం, శరణాగతి. ఒకసారి భారతం ఏమి చెప్తోందో చూద్దాం.

షడ్ దోషాః పురుషేణేహ
హాతవ్యా భూతిమిచ్ఛతా!
నిద్రా తన్ద్రా భయం క్రోధ
ఆలస్యం దీర్ఘ సూత్రతా!

భారతంలోని ఉద్యోగ పర్వంలో విదురుడు "అతినిద్ర, బద్ధకం, భయం, క్రోధం, అలసత్వం, ఎడతెగని ఆలోచన అనే ఆరుదోషాలను జయించినప్పుడే లక్ష్యాన్ని చేరగలుగుతాడు" అని చెప్తాడు. అనుకున్నది జరగడం, జరగకపోవడం సంభవమే. విజయంలో పొంగిపోతే అహంకారం పలకరిస్తుంది. అపజయంలో క్రుంగిపోతే ఆత్మన్యూనత వరిస్తుంది. మన ఉన్నతికి విఘాతం కలిగించే దోషాలను వదిలివేయడం, లోపాలను సవరించుకుంటూ, ముందుకు సాగడం వల్ల పరిణతి ఉన్నతి లభిస్తాయి.

అయితే ఈ జ్ఞానం కలగాలి అంటే ముందు అహంకార త్యాగం జరగాలి. అంతవరకూ ఆత్మోన్నతికి సంబందించిన ఏ సత్యం మనకు కానరాదు.

దానికి అనుసరించాల్సిన సులభమైన మార్గం భగవన్నామ స్మరణ. నిరంతర స్మరణ. నిరంతర ధ్యాస. మనం తీసుకునే ప్రతీ శ్వాస, వీక్షిస్తున్న అంశం ఆ స్వామి కృపవల్లే అని తెలుసుకుని, దానిని ఆ స్వామి ప్రసాదం గా భావించి, కర్మని చేసుకుంటూ పోవడమే.  ఇది సూక్ష్మంగా మన సాయి మాటలలో దాగిన గూఢార్ధ భావం.

“సమస్త ఇంద్రియములను, మనస్సును భగవంతుని ఆరాధన కొరకే నియమించుము. ఇతరముల వైపు మనస్సు పోనివ్వకుము. ఎల్లప్పుడూ నన్నే జ్ఞప్తి యందు ఉంచుకొనుము. మనసును ధన సంపార్జనము, దేహ పోషణ, గృహ సంరక్షణము ఇత్యాది విషయముల పట్ల సంచరించకుండా గట్టిగా నిలుపుము.  అప్పుడది నెమ్మది వహించి శాంతముగాను, చింతా రహితముగాను ఉండును.  మనస్సు సరియైన సాంగత్యములో ఉందనుటకు ఇదియే గుర్తు.  చంచల మనస్సుకు స్వాస్థ్యము చిక్కును” .

ఈ మాటలు మనకు ఆరవ అధ్యాయములో బాబా వారు బోధిస్తారు.  5 పదులు దాటిన ఎందరికో ఈ మాటలు జీవితంలో ఎంత ముఖ్యమైనవో చెప్పాల్సిన అవసరం లేదు. జీవితం అంతా మన అన్న వాళ్ళకై గడిపి, ఎక్కడా ఆగకుండా పరుగు పెట్టిన 5 పదులు నిండిన వారికి ఈ మాటల ప్రాశస్త్యం బాగా తెలుస్తుంది. ఈ మాటలు జీవితంలో ఎంతో ముఖ్యం అయిన శాంతిని పొందే మార్గాన్ని బోధిస్తాయి.  అనుభవ గ్రాహ్యంగా తెలియడానికి ఎంతో సమయం పట్టే ఈ శాంతి మార్గాన్ని స్వామి వారు అందరికి అర్ధం అయ్యేలా బోధించారు.  డబ్బు, దర్పం, బంధువర్గం, పిల్లలు ఇవేమీ నిజమైన శాంతిని ఇవ్వలేవు అని తెలియడానికి ఎంతో సమయం పడుతుంది.  అప్పుడు దాన్ని తెలుసుకుని కూడా , శాశ్వత శాంతిని పొందేందుకు చేసే ప్రయత్నానికి సమయం సరిపోక పోవచ్చు. అటువంటి గొప్ప సత్యాన్ని మనకు సాధారణ మాటల్లో బోధించడమే కాక దానిని పొందే మార్గాన్ని కూడా చెప్పారు.

తెలుసుకోవాల్సింది వొకటే సత్యం.  ఒకటే మార్గం. అదే సంపూర్ణ శరణాగతి.  పిల్లలు, సంపాదన, ఆస్తులు అంటూ పెంపర్లాడకుండా మనసుని స్వామివైపు కేంద్రీకరించి, ఆయనను అర్ధిస్తూ, సమస్త కార్యాలను నిష్కామభావం తో చేస్తూ, ఆ కర్మ ఫలాన్ని కూడా ఆయనకే అర్పిస్తే మనకు వచ్చేది శాశ్వత శాంతి, ఆనందం. ఇది ఎంత ముఖ్యమో, ఎలా సాధించాలో చూద్దాం స్వామి వారు నుడివిన మార్గం లో.

ఇలా సంపూర్ణ శరణాగతి సాధించాలి అంటే మనకు మన జీవిత సత్యం, లేదా మానవ జీవిత ధ్యేయం తెలియాలి. అది సద్గురు బోధలో ఎంతో మెండుగా ఉంది. సరే ఈ విషయం లో పంచమ వేదం అనబడే భారతం లో వ్యాసుడు తన పుత్రుడైన శుకుడికి ఏం బోధించాడో చూద్దాం.

వ్యాసుడు తన కుమారుడికి వైరాగ్యం బోధిస్తూ " కుమారా ! శుకా ! నీవు ఇంద్రియములను, మనసును తప్పుమార్గమున పోనీయక అదుపులో ఉంచుకుని వాటిని సరి అయిన మార్గములో పెట్టు. కోపరాహిత్యం, సత్యం పలకడం, ఇంద్రియములను అదుపులో పెట్టుకోవడం, ధర్మమార్గంలో నడవడం, సత్ప్రవర్తన కలిగి ఉండటం, తపస్సు చేయడం, అహింసామార్గం అవలంబించడం ఇవి ధర్మ మార్గాలు. వీటిని అవలంబిస్తూ ఆకలి దప్పులను అదుపులో పెట్టుకో.

నీవు సంపాదించిన బిక్ష ముందు దేవతలకు సమర్పించి తరువాత అతిథులకు పెట్టి తరువాత నీవు భుజించు. పంజరంలో పిట్టలా శరీరంలో ఉన్న జీవుడిని మరిచి నీ ఇచ్చ వచ్చిన రీతిలో చరించడం ధర్మము కాదు. ఒక్కోరోజు గడిచే కొద్దీ కొంత ఆయుస్సు లెక్కన నీ ఆయుస్సు తరుగుతూ ఉంటుంది. చివరకు మృత్యువు నిన్ను కబళిస్తుంది. ఆ విషయం ఎరుగక నిద్రావస్థలో ఉండటం నీకు ధర్మమా ! ఈ శరీరం రక్త మాంసమయం. జగతిన ఉన్న ప్రాణులన్నీ అంతే. శరీరక సుఖములకు అలవడిన మానవుడు పెద్దల మాటను పెడచెవిన పెట్టి లోకము గురించి తలపక తామనుకున్నదే నిజమని భ్రమిస్తుంటారు.

శారీరక సుఖమే ప్రధానమని అనుకోవడంలో ముందుగా సుఖం ఉన్నా తరువాత ఆపద కలిగిస్తుంది. కనుక బుద్ధిమంతులు నడిచే తోవను వదిలి దుర్మార్గులు నడచు తోవను నడవడం నీకు ధర్మంకాదు. ధర్మమార్గాన నడిచే సజ్జనుల బాటలో నడుస్తూ వారి ఉపదేశములను విను. సాలెపురుగువలె నీ చుట్టూ బంధనం కలిగించుకోవడం అజ్ఞానుల లక్షణం.

సంసారంలో ఇంద్రియములే జలం, కామ, క్రోధ, లోభములే మొసళ్ళు. ఆ సాగరం దాటడానికి జ్ఞానం ఒక్కటే మార్గం. మూఢునిలా కోరికలతో మనసుని తృప్తి పరుస్తూ ఉంటే నీకు తెలవకుండా మృత్యువు నిన్ను కబళిస్తుంది. నీవలా ఉండ వద్దు. బ్రాహ్మణత్వం పొందడం చాలా కష్టం. నీ పూర్వజన్మ సుకృతం వలన నీకీ జన్మ లభించింది. నీవు దానిని వృధా చేస్తున్నావు. నీవు ఇకనైనా దుష్టసాంగత్యం వదిలి తపస్సు, ఇంద్రియ

నిగ్రహం, నిశ్చలత్వం, వివేకము మొదలైన మంచి గుణములను అలవరచుకో.

కుమారా ! నీవు బ్రాహ్మణ జన్మ ఎత్తింది శారీరక సుఖము అనుభవించడానికి కాదు. నియమ నిష్టలతో జీవితము గడిపి పరలోక సుఖములు అనుభవించడానికి కదా ! ఇహలోక కామ సుఖములు అనుభవించడం తన మెడకు తాను ఉరి వేసుకోవడమే కదా ! వివేకవంతులు ఆపని ఎన్నటికి చెయ్యరు. ఒక వేళ చేసినా ఆ ఉరిత్రాడు తెంచుకుని జ్ఞానమార్గంలో నడవడం అలవర్చుకోవాలి. మూర్ఖులు మాత్రమే ఈ విషయము గ్రహించ లేక ఉరిత్రాడుకు వ్రేలాడుతూ ఉంటారు.

కుమారా ! శరీరంలో ప్రాణం ఉన్నంత వరకే నిన్ను భార్యాబిడ్డలు, మిత్రులు అనుగమిస్తారు. ఆ తరువాత నిన్ను మరచి పోతారు. కనుక వారితో పొద్దుపుచ్చక వైరాగ్యం అలవరుచుకుని నిన్ను నీవు తెలుసుకుని ఆత్మసాక్షాత్కారం చేసుకో. ముసలితనము, మరణము పుట్టినప్పటి నుండి నిన్ను వెన్నంటుతూ ఉంటాయి. కనుక మృత్యువు నీ కొరకు వేచి ఉండక ఎప్పుడైనా కబళించ వచ్చు మంచి పనులు చేయడానికి ముహూర్తం కొరకు ఎదురుచూడ వద్దు.

కుమారా ! భార్యా బిడ్డలు నీ వెంట రారు. నిన్ను శ్మశానానికి మోసుకు వెళ్ళి అక్కడ కాల్చి వారిదారిన వారు పోతారు. ఇన్ని రోజుల నుండి వెంట ఉన్న నిన్ను అనుగమించని వారి కొరకు తాపత్రయపడుతూ వల్లమాలిన మమకారం పెంచుకోవడం ఎందుకు ? కాలం ఈ లోకాన్ని అతలాకుతలం చేస్తుంది కనుక ధైర్యంతో ప్రాపంచిక విషయములను వదిలి అంతర్ముఖుడవు కా !

కుమారా ! నీవు ఈ జన్మకు ముందు ఎన్నో జన్మలు ఎత్తావు. ఆ జన్మలో భార్యా బిడ్డలు, మిత్రులు ఉన్నారు వారూ మరణించారు. అలాగే ఈ జన్మలోని వారూ మరణించే వారే ! కనుక నీవూ, నీ భార్యా బిడ్డలు, బంధు మిత్రులు నిరంతరం పుడ్తూ చస్తూనే ఉంటారు. ఈ సత్యం తెలుసుకో . వివేక వంతులు" నేను ఎవరిని ? ఎవరి వాడను ? ఎక్కడ నుండి వచ్చాను ? ఎక్కడకు పోతాను ? పుట్టక పూర్వము ఎవరి వాడనో తెలియదు. మరణించిన తరువాత ఎవరి వాడనో తెలియదు. ఎక్కడ నుండి వచ్చానో తెలియదు. ఎక్కడకు పోతానో తెలియదు. అని తలచిన నీకిక బంధనాలు ఉండవు.

కష్టాలు భార్యమీద వ్యామోహంతో మొదలై పరలోకం వరకు వెన్నంటి ఉంటాయి. కనుక వివేకవంతులు భార్యా వ్యామోహంలో పడరు. అనుభవించకుండా, దానం చెయ్యకుండా దాచుకున్న ధనం ఎందుకు ? ఇంద్రియములను జయించలేని ధనం, దర్పం ఎందుకు. ధర్మప్రవర్తన లేని వేదాధ్యనం లేని శాస్త్రవిజ్ఞానం నిష్ప్రయోజనం. ఇంద్రియములను జయించ లేని ఆత్మ దర్శనం ఎందుకు. కనుక కుమారా ! సంసారం త్యజించి జితేంద్రియుడవు కమ్ము " అని ఉపదేశించాడు. ఇలా తండ్రి వలన బోధింపబడిన వాడై శుకుడు వైరాగ్యం పొందాడు " అని భీష్ముడు చెప్పాడు.

పంచమ వేదంగా భాసించిన భారతంలోనే కాక ఇతర ఎన్నో శ్రుతి, స్మృతులలో బోధించిన ఈ నిత్య సత్యాన్ని, బాబా వారు ఎంతో మామూలు పదాలలో మనందరకూ అర్థం అయ్యే రీతిలో బోధించారు.

శ్రీ సాయి బాబా వారి మాటల్లో శాంతి - చింతారాహిత్యం తద్వారా సాంగత్య నిర్ధారణ బోధించడం చూశాము. అది ఎలా సాధ్యం, దాని పర్యవసానం ఏమిటి అన్నది మనం శాంతి పర్వం లో వచ్చే ధర్మనందనుడు - భీష్మ పితామహుల సంవాదం లో చూద్దాం.

ధర్మరాజు " పితామహా ! ఇప్పటి వరకు రాజోచితప్రవర్తన, ధర్మాలు తెలియ చెప్పారు. ఇక ప్రజల మంచిచెడులు వారి ధర్మాలు వివరించండి " అని అడిగాడు. భీష్ముడు " ధర్మనందనా ! లోకంలో ధర్మం పలువిధముల విస్తరించి ఉంది. అన్ని ధర్మములు అనుసరించ తగినవే అయినా తత్వం తెలిసినవారు మాత్రమే మోక్షమే ఉత్తమమార్గమని చెప్తారు.

ఇష్టం, అయిష్టం మరచి ద్వందాతీతంగా సంపదను అనుసరించడమే మోక్షమార్గం. ఇందుకు ఉదాహరణగా నీకొక కథ చెప్తాను.

పూర్వం సేనజిత్తుడు అనే మహారాజుకు పుత్ర వియోగం కలిగింది. అతడి వద్దకు ఒక ఆప్తుడైన బ్రాహ్మణుడు వచ్చి " మహారాజా ! చింతించడం ఎందుకు పుట్టిన వారికి మరణం తప్పదు. నీ కుమారుడికి మాత్రమే మరణం సంప్రాప్తించిందా ! మూర్ఖత్వంతో ఇలా ఎందుకు చింతిస్తున్నావు ? " అని పలికాడు.

మహారాజు " మరి ఈ దుఃఖం పోవాలంటే ఏమి చేయాలి " అని అడిగాడు.

బ్రాహ్మణుడు " మహారాజా ! నదీప్రవాహములో ఎన్నో దుంగలు కొట్టుకుని పోతున్నాయి. వాటిలో రెండు దగ్గరకు చేరుతాయి. కొంచెం దూరం పోగానే తిరిగి విడిపోతాయి. భార్యా, పుత్రులు, బంధువులు కూడా అంతే జీవితంలోకి వస్తుంటారు, పోతుంటారు. కనుక శాశ్వతంకాని ఈ శరీరాల కొరకు చింతించడం మూర్ఖత్వంకాదా !

నీ శరీరమే నీ స్వాధీనంలో ఉండదు. ఏది ఎప్పుడు రోగగ్రస్థమౌతుందో నీకు తెలియదు. ఎప్పుడు శాశ్వతంగా పోతుందో నీకు తెలియదు. ఇక భార్యా, పుత్రుల గురించి మోహం ఎందుకు ? మోహం లేనప్పుడు చింత లేదు. మానవునికి సుఖం, దుఃఖం ఒక దాని వెంట ఒకటి వస్తూపోతూ ఉంటాయి. సుఖమూ నిలువదు దుఃఖం నిలువదు. వివేకులు సుఖం వచ్చినప్పుడు పొంగి పోరు. దుఃఖం వచ్చినప్పుడు కుంగి పోరు.

మనిషి నాది అనుకున్న వస్తువు దూరమైనప్పుడు దుఃఖిస్తాడు. నాది అన్న సంగం వదిలినప్పుడు దుఃఖం లేదు కదా ! పూర్వజన్మ సంస్కారం అనుసరించి సంయోగ వియోగములు సంభవిస్తాయి. పండితుడికి, పామరుడికి కర్మఫలములు ఒకటిగానే సంభవించినా పండితుడు వాటికి కలతచెందడు. పామరుడు దానిలో లీనమౌతాడు. కనుక ద్వందాతీతంగా ఇష్టం, అయిష్టం వదిలి సుఖదుఃఖాలకు చలించక ప్రవర్తించిన చింతలు ఉండవు. దీని గురించి పింగళ అనేవేశ్య ఇలా చెప్పింది.

పింగళ ఒక సారి తన ప్రియుడి కొరకు ఎదురు చూస్తూ ఉంది ఎంతకీ అతడు రాకపోయేసరికి తనలో " నేను ప్రియుడి కొరకు ఎదురు చూస్తూ పిచ్చిదాన్ని అయ్యాను. కాని అతడు ఇలా పిచ్చి వాడు కాలేదుకదా ! అలాంటి వాడికొరకు నేను ఎందుకు బాధపడాలి. కనుక నేనిక కళ్ళుమూసుకుని నిద్రపోతాను. నా వద్దకు రాని వాడికొరకు బాధపడే కంటే వచ్చిన వాడే ప్రియుడను కోవడం మంచిది. రానివాడి మీద ఆశపెట్టుకుని కుంగిపోతూ పిచ్చిదానినై సర్వనాశనం అయ్యేదాని కంటే ఆశవదులుకుని ఉన్న దానితో తృప్తిపడుతుంటాను.

కనుక మహారాజా ! లేని దాని కొరకు బాధపడక ఉన్న దానితో సుఖంగా జీవించు. ధర్మనందనా ! ఈ కథలోని అంతరార్ధం గ్రహించి ఉన్నదానితో తృప్తిపడడం నేర్చుకో తృప్తినిమించిన సుఖం, సంపద మరొకటి లేదు.

అయితే భారతం ఒక విధం గా మనకి వైరాగ్యాన్ని బోధించి మనసుని నియంత్రించుకోమని వదిలేసింది. కాని మన బాబా వారు అలా వదిలేయకుండా మరి కొంత ముందుకు వెళ్లి భగవత్ స్మరణని బోధించారు. అది ఎందుకో తెలియాలి అంటే మనం భగవద్గీత అ.3 శ్లో.5 చూద్దాము.

నహి కశ్చిత్ క్షణమపి,
జాతు తిష్ఠస్య కర్మకృత్!
కార్యతే హ్యవస: కర్మ,
సర్వ: ప్రక్రృతి జైర్గుణైః!!

ఎవ్వరూ కర్మ అన్నది చేయకుండా ఒక్క క్షణం కూడా ఉండలేరు. ప్రక్రృతి నుండి పుట్టిన త్రిగుణాల వల్ల, అస్వతంత్రులై ప్రవర్తిస్తూ ఉంటారు.

ఈదేహం సత్వ- రజస్-తమో గుణ మేళవిక తో తయారయింది. ప్రతీ క్షణం ఈ మూడు గుణాల్లో ఏదో ఒకటి వేరే రెంటిని నియంత్రించి హెచ్చవుతూ వుంటుంది. దాన్ని బట్టే ఆ సమయంలో మన నడవడిక వుంటుంది. ఇది ఆగుణాల సహజ స్వరూపం. ఆవిషయంలో మనం అస్వతంత్రులం. దాన్ని సాక్షీభూతుడిగా చూస్తూ మన నిశ్చల స్థితిలో మనం వుండక త్రిగుణాల ప్రేరేపణతో చేయబడ్డ ఆ కర్మలకి మనమే కర్తుర్త్వాన్ని ఆపాదించుకుని మంచి చెడులని మన ఆగామి కర్మ కి చేర్చి, దాన్ని భోగించడానికి మళ్ళీపుడుతున్నాం.

అలా ఒక్క క్షణం కూడా ఖాళీగా ఉండలేని మనస్సుకి ఏ ఆలంబన లేకపోతె అది మళ్ళీ తన కుత్సిత భావాలలో మునిగి పోతుంది. అందుకని దానికి తరించే మార్గం గా భగవన్నామ స్మరణని బోధించారు. పంచమవేదం గానూ భావించబడే భారతం ఇత్యాదుల తత్వాన్ని ఇంత సులువుగా మనకు అందించిన మన బాబాకు ఏమివ్వగలం మనం కేవలం శ్రద్ధ - సబూరి తప్ప.

ఆరవ అధ్యాయం లో చందనోత్సవం, శ్రీరామనవమి, ఉరుసు ఉత్సవం ఇత్యాదులలో బాబా వారికి అన్న దానం అంటే ప్రీతి అని మనకు తెలుస్తోంది. ఈ విషయం మనకు బాబా వారి పలు మందిరాలలో నిరాటంకంగా సాగుతున్న అన్నదానం వల్ల కూడా తెలుస్తోంది.

దానం అనేది దాన గ్రహీతకు సంతృప్తి కలిగించాలి. ధనం ఇవ్వడం వల్ల ఎంతిచ్చినా ఇంకా కావాలనే కోరుకునే అవకాశం ఉంది. దానితో తృప్తి పరచాలంటే కష్టం. అందునా ఆ ధనాన్ని అతను దుష్కార్యాలకు వాడితే దానిని మనం ప్రోత్సహించినట్టవుతుంది. అన్నదానం వల్ల అటువంటిదేమీ ఉండదు. ప్రత్యక్షంగా అతను కడుపు నిండి సంతృప్తి చెందుతాడు. అతని సంతృప్తి మనకు శుభాన్ని కలగజేస్తుంది. ఇంక అన్నం తిని అతను దానిని నేరుగా దుష్కార్యాలకు వాడే అవకాశం లేదు. అందువల్ల అన్నదానం ఎంతో ఉత్కృష్టమైంది. దాని వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. ఇక మిగతా దానాలకు పాత్రత చూడాలి. పాత్రతను నిర్ణయించడానికి ఎన్నో నియమాలు ఉన్నాయి.

అన్నదానానికి పాత్రత అకలి గొన్న వాడికి అన్నం పెట్టడమే. అన్నం పెట్టడం పెద్ద ఖర్చుతో కూడుకున్నది కూడా కాదు. ఎవరికి దానం ఇవ్వాలి అన్న విషయంలో ఒక పద్యం చూద్దాం.

సద్ధర్ములు నక్రోధనులు సత్యరతులు దాంతులును
ధీరత్వ యుతులు నిజకర్మ రతులు విజితేంద్రియులు
సర్వ భూత హితులు నలుబ్ధులును శుభులు దాన పాత్రములు
వేదంబు సాంగంబుగా చదివి షట్కర్మ నిష్ఠుల దొడంగి!

దానం పుచ్చుకునే వారు ధర్మంగా నడిచేవారు. కోపం లేనివారు అబద్ధం ఆడని వారు ధీరులు, విహిత కర్మలు సక్రమంగా ఆచరించేవారు, ఇంద్రియ నిగ్రహం కలవారు, అన్ని ప్రాణుల హితం కోరేవార, లోభం లేనివారు, వేదవేత్తలు అయి ఉండాలని దీని అర్థం.

ఇలా వేరే దానాలు ఏమి చెయ్యాలన్న అర్హతలు చూడాలి. అయితే అన్నదానం విషయములో అదేమీ లేదు. ఆకలి గొన్న వాడైతే చాలు. ఇక ఈవిషయం లో భారతం అనుశాసనిక పర్వం లో శివ-పార్వతుల సంవాదం చూద్దాం.

పార్వతీదేవి " నాథా ! మానవ లోకములో కొంతమంది సుఖసంతోషాలతో సిరిసంపదలతో తులతూగుతుంటారు. సుఖాలను అనుభవిస్తుంటారు. కాని కొంతమంది దరిద్రంతో బాధపడుతుంటారు. దీనికి కారణం ఏమిటి ? " అని అడిగింది పార్వతి.

పరమశివుడు " గతజన్మలో కాకులకు కూడా మెతుకులు పెట్టకుండా పిడికెడు భిక్షము వెయ్యకుండా పిసినారిగా గడిపిన వాడికి ఈ జన్మలో

దారిద్ర్యం చుట్టుకుంటుంది. తినడానికి తిండి కట్టడానికి బట్టలేక బాధపడతాడు. అలా కాక పేదవారికి అన్నపానములు ఇచ్చిన వాడికి, తన బంధువులను స్నేహితులను కష్టకాలంలో ఆదుకున్నవాడికి మరుజన్మలో సిరిసంపదలు కలుగుతాయి. సుఖంగా జీవిస్తారు. కనుక సుఖదుఃఖములు వారి వారి పూర్వజన్మ కర్మపరిపక్వత వలన కలుగుతాయి. అంతేకాని బ్రహ్మదేవుడికి ఒకరి మీద ప్రేమ మరొకరి మీద ద్వేషము ఉండదు.

దేవుడు ఎవరిని పేదవాడుగా పుట్టించడు. ఎవరైనా ఈ జన్మలో పేదవాడుగా జన్మించి కష్టములు అనుభవిస్తున్నారంటే అది వారు పూర్వజన్మలో చేసిన పాపములఫలము అని తెలుసుకోవాలి.

పార్వతీ ! కొంత మందికి సంపదలు ఉంటాయి కాని వారు కడుపునిండా తినరు, అనుభవించరు అలా సంపదఉన్నా దరిద్రము అనుభవిస్తుంటారు. ఎందుకో తెలుసా ! వీరు పూర్వ జన్మలో ఎవరికీ పిడికెడు అన్నము పెట్టి ఉండరు.

అలాగే కొందరు బంధువులు, మిత్రులు పోరగా బలవంతంగా పరులకు ఉపకారం చేసి ఉంటారు. అలాంటి వారు సిరిసంపదలు ఉన్నా అనుభవించలేరు.

కొంతమంది తమకు ఏమీ లేకపోయినా బంధుమిత్రుల సహాయంతో తిండికి గుడ్డకు లోటులేకుండా జీవిస్తుంటారు. అలాంటి వారు పూర్వజన్మలో తమకు శక్తి లేకపోయినా ఇతరులకు దానధర్మములు చేయవలెనని మనసులో గాఢంగా కాంక్షిస్తుంటాడు. అందువలన ఈ జన్మలో కూటికి గుడ్డకు లోటు లేకుండా జీవిస్తుంటారు.

ఈ జన్మలో కొంతమందికి అయాచితంగా ధనము లభిస్తుంది. అలాంటి వారు పూర్వజన్మలో పేదలకు అన్నదానము, ధనరూప దానము, వస్త్రదానము చేసి ఉంటారు.

ఈ జన్మలో శ్రమతో ధనము సంపాదించే వారు పూర్వ జన్మలో ఎవరిని తిప్పించుకోకుండా పేదవారు అడగగానే దాన ధర్మములు చేసినవారు.

కొంతమందికి ఎంత శ్రమపడ్డా ధనముచేకూరదు. అలాంటి వారు పూర్వజన్మలో లోభులై తమను యాచించిన వారిని రేపురా మాపురా అని తప్పించుకుని చివరకు మొండిచెయ్యి చూపి ఉంటారు.

కొంతమంది తమకు మిక్కుటంగా ధనము కలిగినప్పటికీ వారికి ఉన్న రోగముల చేత తిండికూడా తినలేని స్థితిలో ఉంటారు. అలాంటి వారు పూర్వజన్మలో మంచిస్థితిలో ఉన్నప్పుడు దానము చేయకుండా వ్యాధిపీడితుడైన తరువాత దానధర్మములు చేసి ఉంటారు.

ఈ జన్మలో విద్యా, విజ్ఞానము, జ్ఞానము కలిగి ఉండికూడా పేదరికంతో బాధపడే వాడు క్రితం జన్మలో దానధర్మములు చేయాలి అని తెలిసి కూడా దానధర్మములు చేయని వాడే.

ఈ జన్మలో తెలివితేటలు లేకపోయినా కూడా అధికంగా ధనము సంపాదించిన వాడు కిందటి జన్మలో తెలివి తక్కువ వాడైనా పేదసాదలకు దానధర్మములు చేసిన వాడై ఉంటాడు.

ఈ జన్మలో ఏరకమైన బాధలు లేకుండా రోగాలు లేకుండా భార్యా బిడ్డలతో సుఖంగా జీవిస్తున్న వారు పూర్వ జన్మలో సత్యము పలుకుచూ ఇతరుల మీదదయ చూపుతూ దానధర్మములు చేసినవారు" అని పరమశివుడు పార్వతీదేవికి చెప్పాడు.

ఏ విదంగా చూసిన దాన ధర్మాలు శ్రేయస్కరము అనుకుంటే అన్నదానం అన్నిటినీ మించి అందరూ చేయగల, అత్యంత విశిష్టమైన దానం. ఇంతటి మహత్తు కలది కాబట్టే బాబా వారు ఏ దానం చెయ్యాలి అన్న ఆలోచనకు తావివ్వక అతి ప్రశస్తమైన అన్నదానాన్ని ఆచరించమని మనకు బోధించారు.

ఈ ఆరవ అధ్యాయం ముగించే ముందు బాబా వారు బోధించిన స్వధర్మ నిరతి, సజ్జన సాంగత్యం, అలాగే ఉత్సవాల సందర్భంగా భగవన్నామ సంకీర్తన మరియు హరికథ ఇత్యాదులకు ఎందుకు ప్రాముఖ్యం ఇచ్చారో చూద్దాం.

ముందుగా ఈ విషయం లో గీతాచార్యుడు చెప్పిన శ్లోకాలు చూద్దాం.

శుభాశుభఫలైరేవం మోక్ష్యసే కర్మబంధనైః ।
సంన్యాసయోగయుక్తాత్మా విముక్తో మాముపైష్యసి ।। గీత 9-28 ।।

అన్ని పనులను నాకే అర్పితం చేయటం ద్వారా, నీవు శుభ-అశుభ ఫలితముల బంధనముల నుండి విముక్తి చేయబడుతావు. సన్యాసముచే నీ మనస్సు నా యందే లగ్నమై, నీవు విముక్తి చేయబడుతావు మరియు నన్ను చేరుకుంటావు.

ఈ భావం మనకు సజ్జన సాంగత్యంతోనే సాధ్యం అవుతుంది. ఈ విషయం లో ముందుగా "సాధు పురుషులను కలిసే అవకాశం వచ్చినప్పుడు వారి కుల-మతాల గురించి కాకుండా ఆధ్యాత్మిక విషయాలు అడిగి తెలుసుకోవాలి. ఎలాగంటే, ఖడ్గాన్ని కొనేటప్పుడు ఒర(కవచం) అందాన్ని కాక, ఆ ఖడ్గానికి ఉన్న పదును చూసి బేరమాడాలి' ' అన్న కబీరు మాటను గుర్తు చేసుకోవాలి. అలాగే బాబా వారికి సూటిగా సరిపడే మరో కబీరు మాట ఏమిటంటే "సజ్జనులకున్న దైవసంబంధమైన జ్ఞానాన్నే తెలుసుకోవాలి కానీ, వారి కులం గురించి అడగకూడదు" .

మహా భారతం అరణ్యపర్వంలో.. కులం కంటే గుణమే గొప్పనైనది అని తెలిపే ఒక కథను మార్కండేయ మహాముని పాండవులకు చెప్పాడు. అదేంటంటే.. ఒకానొక గ్రామానికి దగ్గరిలో ఓ చిన్న అడవి. అందులో ఎప్పుడూ పారుతుండే నది. ఆ నది ఒడ్డునే ఓ ముని కుటీరం. ఆయన తపస్సు చేసుకుంటూ భిక్షాటనతో ప్రశాంతంగా కాలం గడుపుతున్నాడు. ఒకనాడు భిక్షాటనకు బయలుదేరే ముందు కొంగ ఒకటి ఆయన మీద రెట్టవేసింది. అంతే.. ముని కళ్లెర్ర జేసి పైకి చూశాడు. మరుక్షణం ఆ కొంగ మల మల మాడి కిందపడిపోయింది.

ఆయన యథాప్రకారం భిక్షకు వెళ్లి ఓ ఇంటి గుమ్మం ముందు నిలబడి 'భవతీ భిక్షాం దేహి' అన్నాడు. వెంటనే ఆ ఇంటి గృహలక్ష్మి వంట గదివైపు వెళుతుండగా ఆమె భర్త ప్రయాణం చేసి ఇంటికి వచ్చాడు. దీంతో ఆమె మొదట పతికి సేవ చేసి ఆ తర్వాత భిక్ష తీసుకుని వీధిలోకి వచ్చింది. ఆలస్యం చేశావన్నట్టు ముని ఆమెవైపు కోపంగా చూశాడు. అప్పుడామె.. 'స్వామి, మీ కోపానికి మాడిపోయే కొంగను కాదు. నాకు పతియే దైవం. కాబట్టి, ఆయన సేవ తరువాతే ఏ విషయాన్నైనా చూస్తాను' అన్నది. ఆశ్చర్యపోయిన ముని.. 'అమ్మా, ఎక్కడో అడవిలో జరిగింది మీకు ఎలా తెలిసింది' అని అడిగాడు.

అందుకా తల్లి 'మునీశ్వరా, ఇక్కడికి కొద్ది దూరంలో మిథిలానగరం ఉంది. అక్కడ బోయ అయిన ధర్మవ్యాధుడు మాంసం అమ్ముతూ జీవిస్తున్నాడు. ఆయన మీకు అన్ని విషయాలు బోధిస్తాడు' అని చెప్పి

మునిని పంపింది. ముని అక్కడికెళ్లి.. మాంసం అమ్మే ధర్మవ్యాధుణ్ని చూస్తూ దూరంగా నిలబడ్డాడు. వచ్చిన మునిని చూసి నమస్కారం చేస్తూ ధర్మవ్యాధుడు 'అయ్యా, మిమ్మల్ని నా దగ్గరకి పంపిన ఆ పతివ్రతా శిరోమణి క్షేమంగా ఉన్నదా' అని అడిగాడు. ఆ మాట విన్న ముని ఏమిటి ఈ వింత అన్నట్లుగా నోరు తెరిచి నిలబడిపోయాడు. దీన్ని గమనించిన ధర్మవ్యాధుడు మునిని వెంటబెట్టుకొని తన ఇంటికి బయలుదేరాడు. ఇంట్లోకెళ్లి తల్లిదండ్రుల పాదాలకు నమస్కారం చేసి వారి సేవ చేసుకున్నాడు.

మునివైపు తిరిగి " అయ్యా, ఇది నా దినచర్య. తల్లిదండ్రుల సేవలే నాకు తీర్థయాత్రలు. ఆకలితో ఉన్న వారికి పట్టెడన్నం పెడుతున్నాను. మనసు పెట్టి భగవంతుణ్ణి తలుస్తుంటాను. నా వృత్తిని నిజాయితీగా చేస్తూ ఇలా జీవిస్తున్నాను' అంటూ ముగిస్తాడు ధర్మవ్యాధుడు. దీంతో.. సజ్జనుల కులం కాదు, వారిలోని గుణగణాలే ముఖ్యం అని తెలుసుకున్న ఆ ముని మనసు నిర్మలమై ప్రశాంతంగా తన కుటీరానికి వెళ్లాడు.

ఇక బాబా వారు ఆమోదించిన హరికథ విషయాని కొస్తే శ్రీకృష్ణుల వారి మాటలు చూద్దాం.

సతతం కీర్తయంతో మాం యతంతశ్చ దృఢవ్రతాః I
నమస్యంతశ్చ మాం భక్త్యా నిత్యయుక్తా ఉపాసతే II గీత 9-14 II

(సద్భక్తులు) ఎల్లప్పుడూ నా దివ్య లీలలను గానం చేస్తూ, ధృఢ సంకల్పముతో పరిశ్రమిస్తూ, వినయముతో నా ముందు ప్రణమిల్లుతూ, నిరంతరం వారు నన్ను ప్రేమ యుక్త భక్తి తో ఆరాధిస్తుంటారు.

ఇక్కడ హరికథ, లేదా భగవన్నామ సంకీర్తనను బాబా వారు ఎందుకు ప్రబోధించారో అర్థం అవుతుంది. హరికథ అనేది వేద కాలం నాటిది. సర్వజ్ఞులయిన మహర్షులు ఈ హరి కథా శిల్పాన్ని ప్రప్రధమంగా సృష్టించారు. బ్రహ్మ మానస పుత్రుడైన నారదుడు భక్తి సూత్రాలను ఉపదేశిస్తూ హరికథా గానం చేస్తూ వుంటాడని ప్రతీతి. వేద విభజన చేసినా, అష్టాదశ పురాణాలను లిఖించినా మనశ్శాంతి పొందనేరని శ్రీ వ్యాసునకి శ్రీ మద్భాగవతం రచించి హరికథామృధాన్ని పంచిపెడుతూ మానవోద్ధరణ గావింపునని నారదుడు ఆదేశించాడు.

తరువాత శుకదేవుడు, సౌనకాది మహర్షులు, సూతుడూ హరికథా రూపకమైన భాగవతాన్ని ప్రచారం చేశారంటారు. ఏది ఏమైనా నారద

భక్తిసూత్రము హరికథ యొక్క మూలమని, అలాగే యక్షగానమే హరికథగా రూపాంతరం చెందడం వల్లనేమో బాబా వారు దీనిని ప్రోత్సహించారు. చివరిగా ఈ భగవన్నామ కీర్తన వల్ల మనం ఏమి సాదిస్తామో గీతాచార్యుడు చెప్పిన శ్లోకంలో చూద్దాం.

మన్మనా భవ మద్భక్తో మద్యాజీ మాం నమస్కురు ।
మామేవైష్యసి యుక్త్వైవమ్ ఆత్మానం మత్పరాయణః ॥ గీత 9-34 ॥

ఎల్లప్పుడూ నన్నే స్మరించుము, నా పట్ల భక్తితో ఉండుము, నన్ను ఆరాధించుము మరియు నాకు ప్రణామములు అర్పించుము. నీ మనస్సు మరియు శరీరము నాకు సమర్పించిన పిదప నీవు నా వద్దకు నిస్సందేహముగా వచ్చెదవు.

ఆత్మోన్నతికి అన్ని సాధన ల కంటే భక్తీ సులభతరం అని ఇతాసాలు బోధిస్తున్నాయి. అటువంటి భక్తీ తొమ్మిది విధాలుగా ఉందని నారద సూత్రాలు బోధిస్తున్నాయి. వాట్లలో ఒకటైన కీర్తన అనేది అందరికీ సులభ సాధ్యం. అందువల్ల బాబా వారు దానినే చాల ఆచరణ యోగ్యం గా సూచించి తరింప చేశారు. దీనితో ఆరవ అధ్యాయబోధ ముగుస్తుంది.

6వ ఆధ్యాయం సంపూర్ణం

***యే మనుష్యః మాం ఆశ్రతః!***
***తాన్ సర్వేస్యః కర్మ వినాశనః లభై!!***